వినేశ్‌కు పారిస్ బెర్తు

- ఫోగట్‌తో పాటు రితిక, అన్షు అర్హత
- సత్తాచాటిన భారత రెజ్లర్లు

బిష్కెక్(కిర్గిస్థాన్): భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు బెర్తు దక్కింది. గత కొన్ని నెలలుగా జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఐ)పై అలుపెరుగకుండా పోరాడిన వినేశ్.. ఏషియన్ ఒలింపిక్ క్వాలిఫయర్‌లో తనలో చేవ తగ్గలేదని చేతల్లో చూపెట్టింది. శనివారం జరిగిన మహిళల 50కిలోల విభాగంలో బరిలోకి దిగిన వినేశ్ తొలి రౌండ్‌లో మిరాన్ చియాన్(కొరియా)పై, క్వార్టర్స్‌లో సామనగ్ డిట్(కాంబోడియా)పై, సెమీస్‌లో లౌరా గానిక్‌జి(కజకిస్థాన్)పై విజయాలు సాధించింది. ఇలా వరుసగా రియో(2016), టోక్యో(2020), పారిస్(2024) విశ్వక్రీడలకు వినేశ్ బెర్తు దక్కించుకుంది. మరోవైపు అన్షు మాలిక్(57కి), రితిక(76కి) పారిస్ టికెట్ ఖరారు చేసుకున్నారు. దీంతో మెగాటోర్నీకి అర్హత సాధించిన భారత రెజ్లర సంఖ్య నాలుగుకు చేరుకుంది. ఇప్పటికే అంతిమ్ పంగల్(53కి) క్వాలిఫై అయిన సంగతి తెలిసిందే.

రాహుల్, రుతురాజ్‌కు జరిమానా

లక్నో: ఐపీఎల్‌లో జరిమానాల పరంపర కొనసాగుతున్నది. స్లో ఓవర్‌రేట్‌కు పాల్పడినందుకు లక్నో, చెన్నై కెప్టెన్లు కేఎల్ రాహుల్, రుతురాజ్ గైక్వాడ్‌పై చెరో రూ.12 లక్షల జరిమానా పడింది. శుక్రవారం అటల్ బిహారీ వాజపేయి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్ల కెప్టెన్లు నిర్ణీత సమయంలో వేయాల్సిన ఓవర్ల కంటే తక్కువ వేసిన కారణంగా ఫైన్ విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఐపీఎల్ నిబంధనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వహకులు పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నైపై లక్నో అద్భుత విజయం సాధించింది.

గుకేశ్ X అలీరెజా

క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టొరంటో: ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ డీ గుకేశ్ టైటిల్ వేటకు మరింత చేరువయ్యాడు. టోర్నీలో ప్రస్తుతం 7.5 పాయింట్లతో ఇయాన్ నెపోనియాచి, హికారు నకాముర తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్న గుకేశ్..13వ రౌండ్‌లో పిరౌజా అలీరెజాతో తలపడనున్నాడు. గత గేమ్‌లో తెల్లపావులతో బరిలోకి దిగిన గుకేశ్..అలీరెజాను అధిగమిస్తే టైటిల్ ఖాతాలో వేసుకునేందుకు చాన్స్ లభించినట్లే. నెపోనియాచి, నకాముర మధ్య రసవత్తర పోరు సాగే అవకాశముంది.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	7	6	1	0.67	12
హైదరాబాద్	7	5	2	0.91	10
కోల్‌కతా	6	4	2	1.39	8
చెన్నై	7	4	3	0.52	8
లక్నో	7	4	3	0.12	8
ముంబై	7	3	4	-0.13	6
ఢిల్లీ	8	3	5	-0.47	6
గుజరాత్	7	3	4	-1.30	6
పంజాబ్	7	2	5	-0.25	4
బెంగళూరు	7	1	6	-1.18	2

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

పవర్‌ప్లేలో అత్యధిక స్కోర్లు

125/0-ఎస్ఆర్‌హెచ్X ఢిల్లీ
105/0-కేకేఆర్ X ఆర్సీబీ
100/2-చెన్నైX పంజాబ్

అత్యధిక సిక్స్‌లు

22-ఎస్ఆర్‌హెచ్X ఆర్సీబీ
22-ఎస్ఆర్‌హెచ్X ఢిల్లీ
21-ఆర్సీబీX పుణె

అత్యధిక టీమ్ స్కోర్లు

287/3-ఎస్ఆర్‌హెచ్X ఆర్సీబీ
277/3-ఎస్ఆర్‌హెచ్ X ముంబై
272/7-కేకేఆర్X ఢిల్లీ

రైజర్స్ సునామీ

హెడ్, షాబాజ్, అభిషేక్ వీరవిహారం

- హైదరాబాద్ రికార్డుల మోత
- జేక్ ఫ్రేజర్ ఒంటరి పోరు వృథా
- ఢిల్లీపై సన్‌రైజర్స్ ఘన విజయం

హైదరాబాద్: 266/7, ఢిల్లీ: 199 ఆలౌట్
మొత్తం: 465
ఫోర్లు: 40, సిక్స్‌లు: 31

'ఎవడన్నా కోపంగా కొడుతాడు..లేకపోతే బలంగా కొడుతాడు..వీళ్లేంట్రా చాలా భయంకరంగా కొట్టారు. ఏదో పగతో రగిలిపోతున్నట్లు...బౌండరీలు చిన్నబోయేటట్లు.. చాలా బీభత్సంగా.. పరుగుల సునామీ సృష్టించారు'

శనివారం సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ చూసిన ప్రతీ అభిమానికి కల్గిన అనుభవమిది. ప్రత్యర్థిపై కనీసం కనికరం లేకుండా బౌలర్లను వీరబాదుడు బాదుతూ తమ రికార్డులను తామే తిరుగరాసుకుంటున్న సన్‌రైజర్స్..ఢిల్లీలో పరుగుల సునామీ సృష్టించింది. తాము అడుగుపెట్టనంత వరకే అడుగుపెడితే మసే అన్న రీతిలో ట్రావిస్‌హెడ్, అభిషేక్‌శర్మ..ఢిల్లీ బౌలింగ్ బ్యాచ్‌ను బండకేసి కొట్టారు. అగ్నికి ఆజ్యం తోడైనట్లు..మైదానంలో ఫీల్డర్లు కుదురుకోక ముందే హెడ్, అభిషేక్ పరుగుల వరదకు ఫ్లడ్‌గేట్లు ఎత్తారు. తొలి ఓవర్‌లోనే మొదలైన వీరి విధ్వంసం ఓవర్ ఓవర్‌కు పతాకస్థాయికి చేరుకుంది. పవర్‌ప్లే ముగిసే సరికి వికెట్ కోల్పోకుండా హైదరాబాద్ 125 పరుగులు చేసిందంటే వీరి విధ్వంస రచన ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. వీరి విజృంభణకు ఈసారి 300 పక్కా అనుకుంటున్న తరుణంలో కుల్దీప్ రంగప్రవేశంతో సీన్ మారిపోయింది. ఒకే ఓవర్లో అభిషేక్, మార్క్‌రమ్ ఔట్‌తో ఢిల్లీ పోటీలోకి వచ్చింది. క్లాసెన్ నిరాశపరిచినా.. షాబాజ్ మెరుపులు మెరిపించడంతో మరిన్ని రికార్డులు బద్దలయ్యాయి.

ఢిల్లీ: ఐపీఎల్‌లో మరోమారు పరుగుల వరద సునామీల ముంచెత్తింది. శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు హ్యారికేన్‌లా విధ్వంసం సృష్టించారు. బౌండరీల వర్షంలో ముద్దయిన మ్యాచ్‌లో ఢిల్లీపై 67 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘన విజయం సాధించింది. తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 266/7 భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(32 బంతుల్లో 89, 11ఫోర్లు, 6సిక్స్‌లు), అభిషేక్‌శర్మ(12 బంతుల్లో 46, 2 ఫోర్లు, 6 సిక్స్‌లు)కు తోడు మిడిలార్డర్‌లో షాబాజ్ అహ్మద్(29 బంతుల్లో 59 నాటౌట్, 2ఫోర్లు, 5 సిక్స్‌లు) వీరవిహారం చేశారు. ఈ ముగ్గురు బ్యాటర్లు ఏ మాత్రం కనికరం లేకుండా ఢిల్లీ బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో పవర్‌ప్లే ముగిసే సరికి వికెట్ కోల్పోకుండా సన్‌రైజర్స్ 125 పరుగులు చేసింది. సుదీర్ఘ ఐపీఎల్ చరిత్రలో ఇది నయా రికార్డుగా నమోదైంది. కుల్దీప్‌యాదవ్(4/55) నాలుగు వికెట్లతో రాణించాడు. ఆ తర్వాత భారీ లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ..19.1 ఓవర్లలో 199 పరుగులకు ఆలౌటైంది. జేక్ ఫ్రేజర్(18 బంతుల్లో 65, 5ఫోర్లు, 7 సిక్స్‌లు), రిషబ్ పంత్(44), అభిషేక్(42) సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. నటరాజన్(4/19) నాలుగు వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. మయాంక్(2/26), నితీశ్‌కుమార్(2/17) రెండేసి వికెట్లు తీశారు. హెడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య భారీ స్కోరుతో ఈ మ్యాచ్‌లో 465 పరుగులు నమోదయ్యాయి.

హెడ్, అభిషేక్ నాటు కొట్టుడు:

టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ పంత్..హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఇక్కడే తప్పిదానికి తొలి అడుగు పడింది. ఇంకేముంది లీగ్‌లో ఇప్పటికే తమ రికార్డులను తాము తిరుగరాస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్..మరోమారు ఈసారి ఢిల్లీ పనిపటింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్..ఖలీల్ అహ్మద్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్ రెండో బంతి నుంచే సిక్స్‌తో తమ విధ్వంస రచనకు తెరతీశారు. ఇక్కణ్నుంచి పిచ్‌పై పడిన దాదాపు ప్రతి బంతి బౌండరీని ముద్దాడింది. హెడ్ రెండు ఫోర్లు, అభిషేక్ ఫోర్‌తో 19 పరుగులు వచ్చిపడ్డాయి. లలిత్ యాదవ్ రెండో ఓవర్‌లో హెడ్ రెండు సిక్స్‌లు, ఫోర్‌తో 21 పరుగులు స్కోరుబోర్డుకు జతకలిశాయి. నోకియా వేసిన మూడో ఓవర్ పరుగుల తాకిడిని పతాకస్థాయికి తీసుకెళ్లింది. ఈ ఓవర్‌లో హెడ్ నాలుగు ఫోర్లు, ఓ సిక్స్‌తో 16 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. తానేం తక్కువ అన్నట్లు మరో ఎండ్‌లో అభిషేక్ మెరుపు దాడికి దిగడంతో ఐదు ఓవర్లు ముగిసే సరికి హైదరాబాద్ 103 పరుగుల మార్క్ అందుకుంది. బౌలింగ్ మార్పుగా వచ్చిన ముకేశ్‌కుమార్‌ను హెడ్ గట్టిగా అరుసుకున్నాడు. వరుసగా నాలుగు బంతుల్లో నాలుగు ఫోర్లకు తోడు ఆఖరి బంతికి సిక్స్ కొట్టడంతో పవర్‌ప్లే ముగిసే సరికి హైదరాబాద్ 125 పరుగులు చేసింది. ఈసారి 300 స్కోరు పక్కా అనుకుంటున్న తరుణంలో కుల్దీప్ ఒకే ఓవర్లో అభిషేక్, మార్క్‌రమ్(1)ను ఔట్ చేసి ఢిల్లీని పోటీలోకి తీసుకొచ్చాడు. మరోమారు బౌలింగ్‌కు వచ్చిన కుల్దీప్‌కు హెడ్ వికెట్ సమర్పించుకోవడంతో ఢిల్లీ ఊపిరి పీల్చుకోగా, భీకరమైన ఫామ్‌లో ఉన్న క్లాసెన్(15)ను అక్షర్ పటేల్ బౌల్డ్ చేశాడు. మిడిలార్డర్‌లో నితీశ్‌కుమార్, షాబాజ్ కీలక ఇన్నింగ్స్‌కు తెరతీశారు. ఢిల్లీ బౌలర్లపై అదే ఒత్తిడి కొనసాగిస్తూ స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. ముఖ్యంగా షాబాజ్ కెరీర్‌లో తొలి అర్ధసెంచరీ మార్క్ అందుకుని హైదరాబాద్ భారీ స్కోరుకు కారణమయ్యాడు.

ఫ్రేజర్, పంత్ పోరాడినా:

భారీ లక్ష్యఛేదనలో ఢిల్లీకి మెరుగైన శుభారంభం దక్కింది. ఓపెనర్ పృథ్వీషా(16)..వాషింగ్టన్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ లక్ష్యఛేదనలో ఢిల్లీకి అదిరిపోయే ఆరంభం దక్కింది. ఫించ్ హిట్టర్ జేక్ ఫ్రేజర్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో హైదరాబాద్ బౌలర్లను తనదైన రీతిలో బాదాడు. దొరికిన బంతిని దొరికినట్లు కసిగా బౌండరీలు బాది..సన్‌రైజర్స్ దీటుగా పోటీలో నిలిపేందుకు ప్రయత్నం చేశాడు. మరో ఎండ్‌లో సహచర బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళ్లడంతో ఛేదన సాధ్యం కాలేదు. మొదటి నాలుగు బంతులను బౌండరీలు కొట్టి ఢిల్లీకి ఊపుతీసుకొచ్చాడు. కానీ ఐదో బంతికి సమద్ క్యాచ్‌తో షా తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ సీజన్‌లో మెరుపులు మెరిపిస్తున్న జేక్ ఫ్రేజర్..హైదరాబాద్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. వార్నర్ (1) నిరాశపరిచినా..అభిషేక్‌తో కలిసి వరుస బౌండరీలతో అదరగొట్టాడు. ఈ క్రమంలో 15 బంతుల్లోనే ఫ్రేజర్ 50 పరుగుల మార్క్ అందుకున్నాడు. అయితే అభిషేక్, ఫ్రేజర్ వెంటవెంటనే ఔట్ కావడం ఢిల్లీ గెలుపు అవకాశాలను దెబ్బ తీసింది. ఒక దశలో హైదరాబాద్‌తో ఢీ అంటే ఢీ అన్న ఢిల్లీకి మిడిలార్డర్ బ్యాటర్లు వైఫల్యం దెబ్బ తీసింది. చివర్లో పంత్ పోరాడినా..లాభం లేకపోయింది. నటరాజన్..ఢిల్లీ పతనంలో కీలకమయ్యాడు.

పవర్‌ప్లేలో అత్యధిక అర్ధసెంచరీలు

6-వార్నర్
3-క్రిస్ గేల్
3-సునీల్ నరైన్
3-ట్రావిస్ హెడ్

3

టీ20క్రికెట్‌లో మూడుసార్లు 250కి పైగా చేసిన టీమ్‌లో ఎస్ఆర్‌హెచ్ ఒకటిగా నిలిచింది. ఈ జాబితాలో సర్రే(3), సోమర్‌సెట్, యార్క్‌షైర్, ఆర్సీబీ(2) ఉన్నాయి.

10 ఓవర్లలో అత్యధిక స్కోరు

158/4-ఎస్ఆర్‌హెచ్ X ఢిల్లీ
148/2-ఎస్ఆర్‌హెచ్ X ముంబై
141/2-ముంబై X ఎస్ఆర్‌హెచ్

ఎస్ఆర్‌హెచ్ తరపున ఫాస్టెస్ట్ హాఫ్‌సెంచరీ

16బంతుల్లో-అభిషేక్‌శర్మ-ముంబైపై
16బంతుల్లో-హెడ్-ఢిల్లీపై
18బంతుల్లో-హెడ్-ముంబైపై

సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 20 ఓవర్లలో 266/7 (హెడ్ 89, షాబాజ్ 59 నాటౌట్, కుల్దీప్‌యాదవ్ 4/55, అక్షర్ 1/29), ఢిల్లీ: 19.1 ఓవర్లలో 199 ఆలౌట్(జేక్ ఫ్రేజర్ 65, పంత్ 44, నటరాజన్ 4/19, నితీశ్ 2/17)

రూ.1.5 కోట్ల విలువైన నల్లమందు పట్టివేత

హైదరాబాద్‌లో ఇద్దరి అరెస్ట్

సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో నల్లమందు సరఫరా చేస్తున్న ఒక ముఠా గుట్టును ఎక్సైజ్ అధికారులు రట్టు చేశారు. రాజస్థాన్‌కు చెందిన దేవేందర్ కాసినియా, తేజారామ్ కొంతకాలంగా నల్లమందు తెచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న డీటీఎఫ్ అధికారులు ధూల్‌పేట, నారాయణగూడ స్టేషన్ల పరిధిలోని నిందితుల ఇండ్లపై ఈ నెల 19న రాత్రి దాడులు నిర్వహించారు. రూ.1.50 కోట్ల విలువైన 160 కిలోల నల్లమందును స్వాధీనం చేసుకున్నారు. కారు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి విజయ్ ఆధ్వర్యంలో జరిపిన ఈ దాడుల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శిరీష, సావిత్రి, సౌజన్య, ఎస్ హెచ్‌వోలు మధుబాబు, రామకృష్ణ పాల్గొన్నారు. వీరిని మంత్రి జూపల్లి కృష్ణారావు అభినందించారు.

భానుడు భగభగ.. చేపలు విలవిల

ఓవైపు భానుడి ప్రతాపం పెరిగిపోగా మరోవైపు చెరువులు ఎండిపోతున్నాయి. ఈ క్రమంలో ఎండ వేడిమిని భరించలేక జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని చింతకాని గూడెపు చెరువులో చేపలు మృత్యువాతపడ్డాయి. మృతిచెందిన చేపలు నీటిపై తేలుతూ ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయి. చేపల మృతితో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

– మహదేవపూర్ (కాటారం)

ఖైదీ కడుపులో తొమ్మిది మేకులు

తొలగించిన గాంధీ వైద్యులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 20: జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఓ యువకుడి కడుపులో నుంచి తొమ్మిది మేకులను గాంధీ దవాఖాన వైద్యులు తొలగించారు. శనివారం గాంధీ దవాఖాన గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్‌వోడీ, ప్రొఫెసర్ శ్రావణ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. తీవ్రమైన కడుపు నొప్పితో యువకుడు నాలుగురోజుల క్రితం దవాఖానలోని ఖైదీల వార్డులో చేరాడు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం వైద్యులు ఎక్స్‌రే, ఇతర పరీక్షలు నిర్వహించి అతడి కడుపులో ఇనుప మేకులు ఉన్నట్టు గుర్తించారు. అనంతరం ఎండోస్కోపీ ద్వారా తొమ్మిది మేకులను బయటకు తీశారు.

ఫణిగిరిగుహలో పార్వతీదేవి శిల్పం

నాగారం, ఏప్రిల్ 20: సూర్యాపేట జిల్లాలోని ప్రముఖ బౌద్ధ క్షేత్రం ఫణిగిరి గుట్టపై పార్వతీదేవి శిల్పం వెలుగులోకి వచ్చింది. ఈ గుట్టపై పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న తవ్వకాలను చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుట్ట ఎక్కడానికి ముందున్న చిన్న గుహలో పార్వతీదేవి శిల్పాన్ని ఆయన గుర్తించారు. ఈ గుహ సుమారు 6 ఫీట్ల పొడవు, వెడల్పుతో 4 ఫీట్ల ఎత్తులో ఉన్నట్టు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. గుహలో దీర్ఘచతురస్రాకారంలో రెండు ఇంచుల లోతులో పానమట్టం మధ్యలో ఉబ్బెత్తుగా రెండు శివలింగాలను తొలిచారని, ఇలా ఐదు జంట శివలింగాలు ఉన్నాయని చెప్పారు. గుహ లోపల వెనుక భాగంలో నాలుగు ఇంచుల ఎత్తులో ఆసీనురాలైన దేవతా శిల్పం చెక్కి ఉందని, బహుశా పార్వతీదేవి శిల్పం కావొచ్చని పేర్కొన్నారు. గుహ పక్క నుంచి తొలిచిన చిన్న దిగుల్ల సాయంతో వెళ్తే మరో శిల్పం పూర్తిగా చెక్కకుండా వదిలి ఉందని, అది బహుశా భైరవ శిల్పమై ఉండొచ్చని రత్నాకర్‌రెడ్డి వివరించారు.

ఫణిగిరిగుట్ట గుహలో పార్వతీదేవి శిల్పం

తాగునీటికోసం యువకుడి నిరసన

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని మాచ్నూర్ ప్రధాన రహదారిపై శనివారం ఓ యువకుడు తాగు నీటికోసం నిరసన చేపట్టాడు. రోడ్డుపై ముళ్ల కంచె వేసి ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. 15 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని, గ్రామంలోని బోరు ద్వారా కూడా నీటిసరఫరా కావడంలేదని వాపోయాడు. బీజేపీ నాయకుడి హామీతో ఆ యువకుడు ఆందోళన విరమించాడు. – ఝరాసంగం

హెచ్‌డీఎఫ్‌సీ అంచనాలు మిస్

- క్యూ4లో 17,258 కోట్ల లాభం

ముంబై, ఏప్రిల్ 20: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిరాశజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికి గాను బ్యాంక్ రూ.17,257.87 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.17,257.87 కోట్ల కంటే ఇది కేవలం 2.11 శాతం అధికం. ఏడాది క్రితం రూ.18,170 కోట్లుగా ఉన్న బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం గత త్రైమాసికానికి రూ.29,080 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. నికర లాభం విషయానికి వస్తే స్వల్పంగా పెరిగి రూ.16,373 కోట్ల నుంచి రూ.16,511 కోట్లకు చేరుకున్నది.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.24 శాతంగా ఉన్నది. గతేడాది ఇది 1.26 శాతంగా ఉన్నది. నికర ఎన్‌పీఏ 0.31 శాతం నుంచి 0.33 శాతానికి పెరిగింది.
- గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను బ్యాంక్ రూ.19.5 డివిడెండ్‌ను ప్రతిపాదించింది.
- బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.60 వేల కోట్ల నిధుల సేకరణకు సంబంధించి బ్యాంక్ బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.13,500 కోట్ల నిధులు వెచ్చించింది. ఏడాది క్రితం ఇది రూ.10,900 కోట్లు కేటాయించింది.
- గత త్రైమాసికంలో 650 శాఖలను ప్రారంభించడంతో మొత్తం బ్రాంచ్‌ల సంఖ్య 8,738కి చేరుకున్నాయి.

ఐపీవోకి ప్రీమియర్ ఎనర్జీస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: సోలార్ సెల్ ఉత్పత్తుల తయారీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీ లిమిటెడ్ స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి సెబీకి దరఖాస్తు చేసుకున్నది కూడా. వ్యాపార విస్తరణ కోసం అవసరమయ్యే నిధుల్లో రూ.1,500 కోట్ల నిధులను ఈ ఐపీవో ద్వారా సమీకరించాలని యోచిస్తున్నది. ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) రూట్‌లో ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన 2.82 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించబోతున్నారు. వీటిలో సౌత్ ఆసియా గ్రోథ్ ఫండ్ 2 హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ 2.38 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయిస్తుండగా, సౌత్ ఆసియా ఈబీటీ ట్రస్ట్‌కు చెందిన 1.53 లక్షల ఈక్విటీ షేర్లు, ప్రమోటర్ చిరంజీవి సింగ్ 42 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. 1995లో ప్రారంభమైన ప్రీమియం ఎనర్జీస్..సోలార్ సెల్ అండ్ మాడ్యుల్‌ను తయారు చేస్తున్నది. ప్రస్తుతం సంస్థ 2 గిగావాట్ల కెపాసిటీతో సెల్స్‌ను ఉత్పత్తి చేస్తుండగా, 3.36 గిగావాట్ల సామర్థ్యంతో మాడ్యుల్స్‌ను ప్రొడ్యూస్ చేస్తున్నది. అలాగే హైదరాబాద్‌తోపాటు సంస్థకు ఐదు ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఈ ఐపీవో ద్వారా సేకరించిన నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం వినియోగించనున్నట్లు తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,428 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.5,300 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి.

తగ్గిన ఆభరణాల ఎగుమతులు

2023-24లో రూ.2.65 లక్షల కోట్లకు: జీజేఈపీసీ

ముంబై, ఏప్రిల్ 20: ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 12.17 శాతం తగ్గి రూ.2,65,187.95 కోట్లు (32,022.08 మిలియన్ డాలర్లు)కు తగ్గాయని జెమ్ అండ్ జ్యూవెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) వెల్లడించింది. అమెరికాలో వడ్డీరేట్లు క్రమంగా పెరుగుతుండటం, చైనా మందకొడి వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణమని విశ్లేషించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.3,01,925.97 కోట్లు(37,646.17 మిలియన్ డాలర్లు) విలువైన ఆభరణాలు ఎగుమతి అయ్యాయి. గతేడాది ఆభరణాల ఎగుమతులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయని, అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగించడం ఇందుకు కారణమని జీజేఈపీసీ చైర్మన్ విపుల్ షా తెలిపారు.

- కట్ అండ్ పాలిష్డ్ డైమండ్ల ఎగుమతులు కూడా 25.23 శాతం తగ్గి రూ.1,32,128.29 కోట్లకు తగ్గాయి. క్రితం ఏడాది రూ.1,76,716.06 కోట్లు(22,046.9 మిలియన్ డాలర్లు)గా నమోదయ్యాయి.
- పాలిష్డ్ ల్యాబ్ డైమండ్ల ఎగుమతులు కూడా ఏడాది ప్రాతిపదికన 13.79 శాతం తగ్గి రూ.13,468.32 కోట్ల నుంచి రూ.11,611.25 కోట్లకు తగ్గాయి.
- కానీ, బంగారు ఆభరణాల ఎగుమతులు 20.57 శాతం పెరిగి రూ.92,346.19 కోట్లు(11,140.780 మిలియన్ డాలర్లు)గా నమోదయ్యాయి. ఏడాది క్రితం ఇది రూ.76,589.94 కోట్లు(9,538.84 మిలియన్ డాలర్లు)గా ఉన్నది.
- వెండి ఆభరణాల ఎగుమతులు 43 శాతం తగ్గి రూ.23,556.71 కోట్ల నుంచి రూ.13,406.1 కోట్లకు పరిమితమయ్యాయి.

జొమాటోకు 12 కోట్ల పన్ను నోటీసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఫుడ్ డెలివరీ సేవల సంస్థ జొమాటోకు గట్టి షాక్ తగిలింది. జూలై 2017 నుంచి మార్చి 2021 మధ్యకాలంలో ఎగుమతుల సేవలపై జీఎస్టీ ఎగవేసినందుకుగాను సంస్థకు రూ.11.82 కోట్ల పన్ను డిమాండ్, జరిమానా నోటీసు జారీ అయింది. సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్ అడిషనల్ కమిషనర్ రూ.5,90,94,889 జీఎస్టీ డిమాండ్ నోటీసు జారీ చేయగా, జరిమానాపై పెనాల్టీ రూపంలో మరో రూ.5,90,94,889 విధించారు.

వాణిజ్య

చిన్న మార్కెట్లపై దృష్టి

క్రీమ్‌లైన్ డెయిరీ ప్రొడక్ట్స్ సీఈవో భూపేంద్ర సూరీ

హైదరాబాద్, ఏప్రిల్ 20: జెర్సీ బ్రాండ్‌తో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న క్రీమ్‌లైన్ డెయిరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్ తన వ్యాపార శైలిని మార్చుకుంటున్నది. దేశవ్యాప్తంగా చిన్న ప్యాకెట్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇక నుంచి చిన్న సైజులో తమ ఉత్పత్తులను విడుదల చేయనున్నట్లు కంపెనీ సీఈవో భూపేంద్ర సూచీ ప్రకటించారు. ప్రస్తుతం లీటర్, అర లీటర్ ప్యాకేట్లలో ఉత్పత్తులను విక్రయిస్తున్నది. అలాగే రోజుకు దేశవ్యాప్తంగా ఉన్న 10 ప్లాంట్ల నుంచి 7 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరిస్తున్నట్లు, వీటిలో తెలంగాణ నుంచి 2 లక్షల లీటర్లు సమీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 15 రాష్ట్రాల్లో 300కి పైగా పాల ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు,